



అక్టోబర్ 1న పొదుపు మహిళలతో ముఖాముఖి మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు (ఫైల్)

మహాసభ విజయవంతం

- పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- సిపిఎం జిల్లా మహాసభ తీర్మానం
- 26 మందితో జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/ఎమ్మిగనూరు

సిపిఎం కర్నూలు జిల్లా 23వ మహాసభ రెండో రోజు సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లోని కామ్రేడ్ రాజేశ్వర్ రెడ్డి, సోమన్న ప్రాంగణంలో కొనసాగి విజయవంతంగా ముగిసింది. తొలుత పార్టీ జెండాను ఆ పార్టీ సీనియర్ నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్తూపానికి ప్రతినిధులు నివాళులు అర్పించారు. అనంతరం మొత్తం 20 తీర్మానాలకు మహాసభ ఆమోదం తెలిపింది.



సిపిఎం జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు

మహాసభ తీర్మానాలు :

కర్నూలు జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి, యువతకు ఉపాధి కల్పించాలని సిపిఎం జిల్లా మహాసభ తీర్మానించింది. జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, వారిని క్రమబద్ధీకరించాలని, వలసలు నివారించాలని, మహిళలపై దాడులను అరికట్టాలని, అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి భద్రత కల్పించాలని మహాసభ తీర్మానించింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని, జిల్లాలో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఐటి, ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. జిల్లాలో రైల్వేను అభివృద్ధి చేయాలని, పట్టణ సమస్యలను పరిష్కరించాలని, దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలని, ముస్లిం మైనారిటీల సమస్యలు పరిష్కరించాలని, వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని మహాసభ తీర్మానించింది. దళితులపై దౌర్జన్యాలు అరికట్టాలని, వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని, వారిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రత్యేక సబ్ ప్లాన్ కేటాయించాలని మహాసభ డిమాండ్ చేసింది. రజక వృత్తిదారులపై దాడులను నివారించి రక్షణ తేవాలని, గొర్రెల, మేకల పెంపకందారులకు ప్రత్యేక రుణాలు ఇవ్వాలని, చేనేత కేంద్రాలలో చేనేత పార్కులు ఏర్పాటు చేసి సమగ్ర చేనేత విధానం రూపొందించి అమలు చేయాలని మహాసభ తీర్మానించింది.

ఉద్యమాల ద్వారా బిజెపిని దెబ్బకొట్టాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు



బలమైన ప్రజా ఉద్యమాల ద్వారా బిజెపిని దెబ్బకొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలపై పోరాటాలు కొనసాగించా లన్నారు. జమిలీ ఎన్నికలు వస్తే రాజ్యాంగ పరిరక్షణ ఉండదన్నారు. ఆనాడు చంద్రబాబు విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టిన చరిత్ర సిపిఎందని తెలిపారు. విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని, వాటిని తిప్పికొట్టాలని కోరారు.

సిపిఎం రాష్ట్ర నాయకులు జి.రామన్న మాట్లాడుతూ దేశం అప్రకటిత ఎమర్జెన్సీ ఎదుర్కొంటోందన్నారు. యువతను మతం మత్తులోకి, మూఢనమ్మకాల్లోకి బిజెపి నెడుతోందని, బిజెపిని రాష్ట్రంలో ప్రధాన పార్టీలు వెనకేసుకు వస్తున్నాయని చెప్పారు. సిద్ధాంతికంగా బిజెపిని ఎదుర్కోవాలని అన్నారు.

మహాసభ అధ్యక్ష వర్గంగా పి.నిర్మల, టి.రాముడు, లక్ష్మన్న వ్యవహరించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె ప్రభాకర్ రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, రాష్ట్ర నాయకులు రామన్న, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు. 30 ఏళ్లుగా ప్రజాశక్తి ఏజెంటుగా పని చేస్తున్న ఆదోని ఈరన్నను సన్మానించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్‌తో పాటు పలువురు నాయకులను ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి శాలువాలతో సన్మానించారు.



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు



రాధాకృష్ణను సన్మానిస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి



విప్లవ గేయాలను ఆలపిస్తున్న పిఎన్ఎం కళాకారులు

సిపిఎం జిల్లా కార్యదర్శిగా రెండోసారి డి.గౌస్ దేశాయ్



సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శిగా డి.గౌస్ దేశాయ్ రెండోసారి ఎన్నికయ్యారు. మహాసభ సందర్భంగా 26 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా పి.నిర్మల, జి.రామకృష్ణ, కె.వెంకటేశ్వర్లు, కెవి నారాయణ, ఎండి అంజిబాబు, ఎండి ఆనంద్ బాబు, టి.రాముడును ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా బి.రామాంజనేయులు, వై.నగేష్, సి.గురుశేఖర్, ఎం.రాజశేఖర్, ఎం.విజయ్, కె.అరుణ, ఎన్.అలివేలు, టి.నరసింహ, జె.మోహన్, డి.లక్ష్మన్న, కె.లింగన్న, పి.హనుమంతు, బి.వీరశేఖర్, సి.గోవిందు, నాగన్న, బాలకృష్ణను ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుంది.



26 మందితో ఎన్నికైన సిపిఎం జిల్లా నూతన కమిటీ

ప్రముఖులొచ్చారు..

- 2024లో జిల్లాలో పలువురి పర్యటన



మే 6న కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి (ఫైల్)

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఈ ఏడాదిలో జిల్లాకు పలువురు ప్రముఖులు విచ్చేశారు. ఎన్నికలు ఉండటంతో పోటా పోటీగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేత హోదాలో, ముఖ్యమంత్రిగా జిల్లాకు వచ్చారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా, మాజీ ముఖ్యమంత్రిగా జిల్లాలో పర్యటించారు. వారితో పాటు మరికొంత మంది రాష్ట్ర, జాతీయ నాయకులు జిల్లాలో పర్యటించారు.

ఎన్నికల ప్రచారంలో..

ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు ప్రముఖులు ప్రచారం నిర్వహించారు. పాణ్యం నియోజకవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి డి.గౌస్ దేశాయ్ గెలుపును కాంక్షిస్తూ మే 6న కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి పాల్గొని మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జనవరి 9న ఆళ్లగడ్డలో, 28న పత్తికొండలో 'రా కదలిరా సభలో పాల్గొన్నారు. మార్చి 31న ఎమ్మిగనూరులో, ఏప్రిల్ 29న కోడుమూరు నియోజకవర్గం గూడూరు, డోన్‌లలో, మే 6న పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం చెన్నమ్మ సర్కిల్‌లో, మే 11న నంద్యాలలో జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఆలూరు, కౌతాళంలోనూ ఎన్నికల ప్రచారంలోనూ చంద్రబాబు పాల్గొన్నారు. జనవరి 29న కర్నూలులో పిసిసి అధ్యక్షురాలు షర్మిల పర్యటించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. తరువాత ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా 'మేమంతా సిద్ధం' పేరుతో నంద్యాల, ఎమ్మిగనూరులో నిర్వహించిన బహిరంగ సభల్లో, కర్నూలులో ఎన్నికల ప్రచారంలో వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. నంద్యాల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్‌ను గెలిపించాలని హీరో అల్లు అర్జున్ నంద్యాలలో రోడ్‌షో నిర్వహించారు. ఆదోనిలో బిజెపి తరపున ఎన్నికల ప్రచారంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా పాల్గొన్నారు.

సిఎంగా చంద్రబాబు మూడు సార్లు...

ఆగస్టు 2న ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు శ్రీశైలంలో పర్యటించారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని శ్రీశైలం జలాశయం వద్ద జలహారతి ఇచ్చారు. అనంతరం సున్నిపెంటలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. అక్టోబర్ 1న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పత్తికొండ మండలం పుచ్చకాయలమాడలో పర్యటించారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. నవంబర్ 9న శ్రీశైలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు. సీ ప్లేన్ ద్వారా విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి బయల్దేరి శ్రీశైలం పాతాళగంగ వద్ద ఏర్పాటు చేసిన జెట్టి వద్ద దిగారు. దీంతో సీ ప్లేన్ ప్రయోగం విజయవంతమైంది. అక్కడి నుండి రోప్ వే ద్వారా శ్రీశైలం ఆలయానికి చేరుకున్నారు. భ్రమరాంబిక మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. రోప్ వే ద్వారా పాతాళగంగ చేరుకుని అక్కడి నుండి సీ ప్లేన్ ద్వారా విజయవాడకు తిరుగు ప్రయాణం అయ్యారు.

జగన్ పర్యటనలు ఇలా..

ముఖ్యమంత్రి హోదాలో జగన్ మోహన్ రెడ్డి ఫిబ్రవరి 15న కర్నూలులో నిర్వహించిన అప్పటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనువడి వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు. మార్చి 14న కర్నూలు శివార్లలోని జగన్నాథగట్టు వద్ద లా యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. అదే రోజు బనగానపల్లెలో ఇబిసి నేస్తం మూడో విడత పంపిణీలో పాల్గొన్నారు. డిసెంబర్ 18న మాజీ ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కర్నూలు శివార్లలోని జిఆర్‌సి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి సురేంద్రారెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు.



మార్చి 14న కర్నూలు శివార్లలోని జగన్నాథగట్టు వద్ద లా యూనివర్సిటీకి శంకుస్థాపన చేస్తున్న సిఎం జగన్‌మోహన్ రెడ్డి (ఫైల్)

దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

- కానిస్టేబుల్ అభ్యర్థుల పరుగు పరీక్షలను ప్రారంభించిన ఎస్పీ బిందు మాధవ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కర్నూలు ఉమ్మడి జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఎపిఎస్‌పి 2వ బెటాలియన్‌లో దేహదారుఢ్య పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎస్పీ జి.బిందు మాధవ్ దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను ప్రారంభించి పర్యవేక్షించారు. 600 మంది అభ్యర్థులను ఈ పరీక్షలకు పిలిచారు. 280 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషియన్స్ టెస్ట్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. జిల్లాలో 10,143 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. రోజూ 600 మంది దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొంటారని తెలిపారు. రోజూ మొదట సర్టిఫికెట్ల పరిశీలన, ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్ మెంట్స్ చేస్తారని చెప్పారు. తర్వాత బయోమెట్రిక్ తీసుకుంటారని తెలిపారు. దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షల దగ్గర ఎక్కడా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక ఆర్‌ఎఫ్ఐడి కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. అభ్యర్థులు కచ్చితంగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, నోటిఫికేషన్ వచ్చిన తర్వాత జారీ చేసిన లేటెస్ట్ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు తీసుకురావాలని చెప్పారు. వాటితో పాటు ఆధార్, స్టేజ్-2, స్టడీ, మార్కు లిస్టులు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు. హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

ఆన్‌లైన్‌లో అర్జీలను సక్రమంగా నమోదు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

బాధితుల నుంచి వచ్చే అర్జీలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా బాధితుల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. అనంతరం అక్కడే అర్జీదారులకు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ కౌంటర్లను ఆయన పరిశీలించారు. అర్జీదారులు కూర్చునేందుకు మరిన్ని కుర్చీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిఆర్‌ఒను ఆదేశించారు. వికలాంగులకు ప్రత్యేకంగా ర్యాంపులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రెవెన్యూకు సంబంధించి వివిధ రకాలుగా అర్జీలు వస్తుంటాయని, వాటిని సంబంధిత సబ్జెక్టు, ఆప్షన్‌ల కింద సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. అర్జీదారులకు అన్న క్యాంటీన్ కో ఆర్డినేషన్‌తో స్నాక్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.



రిసెప్షన్ కౌంటర్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్నకలెక్టర్ రంజిత్ బాష

మండల స్థాయి ఎగ్జిబిషన్‌కు అపూర్వ స్పందన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కల్లూరు మండల స్థాయి ఎగ్జిబిషన్‌కు విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభించింది. సోమవారం నగరంలోని శరీన్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌ను ఎంపిడిఒ శేషాచలం రెడ్డి, ఎంఇఒలు శ్రీనివాసులు, వనజకుమారి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన అనేక నమూనాలు ఆలోచనలు రేకెత్తించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి వాటిల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు ప్రతిభను చాటుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. మండలంలోని ఆయా పాఠశాలల నుంచి మొత్తం 8 అంశాల మీద 39 ప్రదర్శనలు పాల్గొన్నాయి.

కార్యకర్తకు ఎమ్మెల్యే గౌరు పరామర్శ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్



కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ టిడిపి మైనారిటీ సెల్ కార్యకర్త హుస్సేన్ బాషను ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పరామర్శించారు. హుస్సేన్ బాష నెల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. సోమవారం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ఆయనను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

అర్జీదారులను సంతృప్తిపరచాలి

- కమిషనర్ రవీంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. 22 అర్జీలు వచ్చాయని, వాటిని పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ప్రజారోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఒ జునైద్, ఎంఇలు సత్యనారాయణ, శేషసాయి, టిపిఆర్‌ఒ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

8న జంతు సంక్షేమ బోర్డు బృందం రాక

కర్నూలు నగరానికి జనవరి 8న భారత జంతు సంక్షేమ బోర్డు (యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా) బృందం రానున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు తెలిపారు. గార్గేయపురం డంపు యార్డులోని కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్ కేంద్రాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ... నగరంలో కుక్కల బెడద నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొన్ని నెలల క్రితం నిలిచిన శునకాల ఆపరేషన్లను ప్రారంభించేందుకు, అనుమతి కోసం నగరపాలక, భారత జంతు సంక్షేమ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. బృందం నగరానికి వచ్చి గార్గేయపురం డంపు యార్డులో ఉన్న కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తుందని తెలిపారు. అనుమతి మంజూరయితే రోజూ 20 శునకాలకు ఆపరేషన్ల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ఆరోగ్యాధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, డిఇఇ గంగాధర్, వెటర్నరీ డాక్టర్ మల్లన్న పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

నగరంలో డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు తెలిపారు. లక్ష్మీపురం, రోజా స్ట్రీట్, వెంకటమణ కాలనీల్లో కమిషనర్ పర్యటించారు. ఆయా కాలనీల్లో డ్రెయినేజీ, పైపులైన్ లీకేజీకి సంబంధించిన ప్రదేశాలను పరిశీలించారు. లక్ష్మీపురంలో నీటి సరఫరాపై ఆరా తీశారు. వెంకటరమణ కాలనీలోని దాదాపు పూర్తయిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి.భరత్ క్యాంపు కార్యాలయ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఆరోగ్యాధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఇ రాజశేఖర్, డిఇఇ గంగాధర్, ఎఇ నాగజ్యోతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మునిస్వామి పాల్గొన్నారు.

పార్టీ కోసం ఇద్దరూ..

- సిపిఎం జిల్లా మహాసభకు భార్యాభర్తలు హాజరు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

సిపిఎం కోసం భార్యాభర్తలు ఇద్దరూ పని చేస్తున్నారు. అటు కుటుంబాన్ని చూసుకుంటూనే పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఎమ్మిగనూరులో జరిగిన సిపిఎం 23వ జిల్లా మహాసభకు ప్రతినిధులుగా హాజరైన భార్యాభర్తలు తమ అనుభవాలను ప్రజాశక్తితో పంచుకున్నారు...

ఇబ్బందిగా ఉన్నా పార్టీ కోసం..

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, ఆయన భార్య రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల మహాసభలో పాల్గొన్నారు. కొంత ఇబ్బందిగా ఉన్నా పార్టీ కోసమే పని చేస్తున్నామని నిర్మల చెబుతున్నారు. ఆమె ఎస్ఎఫ్ఐ నుంచి వచ్చి ఆ తరువాత ఐద్వా, సిఐటియులో పని చేశారు. 1980 నుండి పార్టీలో ఉన్నారు. ఎంఎ గఫూర్ రెండు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కొంత ఇబ్బందిగానే ఉండేదని ఆమె చెప్పారు. ఆమె ఇప్పటి వరకు 22 జిల్లా మహాసభలకు హాజరయ్యారు.



నాయకులకు మా ఇంట్లోనే ఆతిథ్యం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె ప్రభాకర్ రెడ్డి, ఆయన భార్య జిల్లా కమిటీ సభ్యులు అరుణ మహాసభలో పాల్గొన్నారు. '1986లో మాకు వివాహం అయింది. ఆ తరువాత డివైఎఫ్ఐలో చేరాను. 1990లో పార్టీ సభ్యురాలిగా చేరాను. నా భర్త ద్వారానే పార్టీలోకి వచ్చాను. ఇంటి పనులను సమన్వయం చేసుకుంటూనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటాం. రాష్ట్ర, జాతీయ నాయకులు ఎవరు వచ్చినా మా ఇంట్లోనే ఆతిథ్యం ఇస్తుంటాం' అని అరుణ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.



పిల్లలను కూడా పార్టీ ఆలోచనలతో..

పిల్లలను కూడా పార్టీ ఆలోచనలతో పెంచుతున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రామకష్ణ, ఆయన భార్య ధనలక్ష్మి చెబుతున్నారు. ఆయన 1985 నుంచి, ఆమె 1988 నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. 'ఇంటి పని చూసుకుంటూనే పార్టీ కోసం పని చేస్తున్నాం' అని వారు చెబుతున్నారు.



ప్రభుత్వ బడుల్లోనే చదివించాం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, ఐద్వా జిల్లా కోశాధికారి సుజాతకు 1995లో వివాహం అయింది. ఆయన 1985 నుండి పార్టీలో ఉండగా, ఆమె 1998లో పార్టీలో చేరారు. 'ప్రభుత్వ బడుల్లోనే ముగ్గురూ పిల్లలనూ చదివించాం. ఒకరికొకరు సహరించుకుంటూ పార్టీ కోసం పని చేస్తున్నాం' అని వారు చెబుతున్నారు.



తండ్రీ కొడుకులు...



మహా సభలో తండ్రీ కొడుకులు సి.గురు శేఖర్, సాయి ఉదయ్ ప్రతినిధులుగా హాజరయ్యారు. సి.గురు శేఖర్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులుగా, సాయి ఉదయ్ ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శిగా ఉన్నారు.

సమన్వయంతో ముందుకు..

సమన్వయంతో ముందుకు సాగుతున్నమని జి.షాకీర్ బాషా, ఆయన భార్య షేకన్ బీ చెబుతున్నారు. 2012లో పార్టీలో చేరిన ఆయన ఆలూరు మండల కార్యదర్శిగా పని చేసి ప్రస్తుతం ప్రాంతీయ కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఆమె 2017 నుండి పార్టీలో ఉన్నారు. శాఖ కార్యదర్శిగా పని చేస్తున్నారు.



ఉరుకుందలో మహా కుంభాభిషేకం

- డిప్యూటీ కమిషనర్ విజయరాజు


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ విజయరాజు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో మహా కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో మహా కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమాలకు కాంచీపురం నుంచి కంచి కామకోటి పీఠం పీఠాధిపతులు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, పుష్పగిరి నుంచి పుష్పగిరి పీఠం శ్రీశంకరాచార్య శ్రీవిద్య నృసింహ భారతి స్వామి పీఠాధిపతులు, శ్రీశైలం నుంచి పీఠాధిపతులు చెన్నై సిద్ధ రామ శివాచార్య స్వాములు, హళ్ళి మఠం పీఠాధిపతులు మహంతేష్ స్వామి వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, గణపతి విగ్రహ ప్రతిష్టాపన, నవగ్రహాల ప్రతిష్టాపన, హోమ మండపాలు, ధ్వజస్తంభం ప్రతిష్టాపన, కలశ ప్రతిష్టాపన చేపట్టనున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మూడు రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పూజా కార్యక్రమాలు గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లను చేపడుతున్నామని తెలిపారు. దేవాలయ పర్యవేక్షకులు, సిబ్బంది, దేవాలయ అర్చకులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, పర్యవేక్షకులు వెంకటేష్, మల్లికార్జున, ఉప అర్చకులు ఈరన్న స్వామి పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌లో బయటపడిన అక్రమాలు



ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉపాధి పనులపై జరిగిన సోషల్ ఆడిట్‌లో అక్రమాలు బయట పడ్డాయి. మండలంలోని 13 పంచాయతీల్లో 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ చట్టం పనులకు సంబంధించి దాదాపు రూ.8.29 కోట్ల పనులకు సంబంధించి సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ ఆవరణంలో డ్వామా పీడీ వెంకట రమణయ్య ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన వివరాలను ఆయా గ్రామాల్లో జరిగిన పనుల్లో అవకతవకలను, నిధుల దుర్వినియోగాన్ని, కొలతల్లో తేడాను గుర్తించినట్టు అధికారుల ముందు తనిఖీ బృందం వెల్లడించింది. డ్వామా పీడీ వెంకట రమణయ్య వివరిస్తూ... మొత్తం రూ.8.29 కోట్ల పనులు జరిగాయని తెలిపారు. ఇందులో రికవరీ రూ.1,13,140, పెనాల్టీ వచ్చేసి రూ.15 వేలు వేసినట్లు చెప్పారు. దీనిలో ఎక్కువ భాగం అవకతవకలు జరిగిన పంచాయతీ కామదులంలో రూ.83 వేలు రికవరీ చేయగా, అత్యల్పంగా ఉన్న పంచాయతీ కాజీపురంలో రూ.613 రికవరీ చేసినట్లు తెలిపారు. డిపిఒ లోకేష్, ఏపిడీ పద్మావతి, ఎంపిడిఒ అల్లా బకష్, ఎపిఒలు జుబేర్ అహ్మద్, మాధవ శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో యాజమాన్య కమిటీ కీలకం

- డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి


మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ వెంకట రమణారెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు కీలకమని డిప్యూటీ డిఇఒ వెంకట రమణారెడ్డి, ఎంఇఒ-2 శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో బడికి ఎంతో విశిష్ట ఉందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి విద్యార్థికి అందేలా యాజమాన్య కమిటీ కృషి చేయాలని సూచించారు. డ్రాపౌట్ లేకుండా చూడాలన్నారు. బాలికల సంరక్షణకు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సిఎంఒ శివశంకర్, కెఆర్‌పి వెంకట భాస్కర్, డిఆర్‌పి సురేందర్ బాపూజీ, బాలాజీ రావు, గౌస్, ఖాసీం బాష పాల్గొన్నారు.

'జయంతి వారోత్సవాలను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సావిత్రి బాపూలే, ఫాతిమా షేక్ జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని ఆర్‌విఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అయ్యన్న కోరారు. సోమవారం ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారోత్సవాల గోడపత్రికను వారు ఆవిష్కరించారు. జనవరి 3న జిల్లా పరిషత్‌లో జరిగే జయంతి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య బలోపేతానికి పోరాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప
- ఘనంగా 55వ ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ విద్య బలోపేతం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని, విద్యార్థుల కోసం నిరంతరం పోరాడే ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని రాష్ట్ర మాజీ నాయకులు రామన్న తెలిపారు. సోమవారం ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప జెండాను ఆవిష్కరించారు. అనంతరం రామన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర హక్కులను కాలరాస్తూ జాతీయ విద్యా విధానం 2020 తీసుకు రావడం దారుణమని విమర్శించారు. ఈ విద్యావిధానం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు జరిగే నష్టాలను వివరిస్తూ ఢిల్లీ నుంచి గల్లీ వరకు బస్సు జాతాను నిర్వహించినట్లు తెలిపారు. ఫలితంగా రాష్ట్రంలో 400 ప్రభుత్వ పాఠశాలల విలీనం ఆగిపోయిందన్నారు. ప్రతి విద్యార్థి తల్లికి వందనం విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, హాస్టల్ మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి అడ్మిషన్ ప్రారంభించాలని, జీఓ 77ను రద్దు చేయాలని కోరారు. నూతన విద్యా సంవత్సరానికి జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో సొంత భవనాలు, కెజిబివిలో అదనంగా గదులను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆలూరులో సీట్లను పెంచాలని, ఆదోని డిగ్రీ సీట్లను పెంచాలని కోరారు. వీటి కోసం భవిష్యత్తులో జరగబోయే పోరాటాలకు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు


ఎమ్మిగనూరులో జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షులు రంగప్ప

శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు అమర్, పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్, పట్టణ నాయకులు రాము పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని విశ్వ నారాయణ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు సూరి జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, పట్టణ ప్రధాన కార్యదర్శి గౌస్ మాట్లాడారు. విద్యా పరిరక్షణ కోసం పోరాడడంలో ఎస్ఎఫ్ఐ ముందుంటుందన్నారు. ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహణకు సొంత భవనం కేటాయించాలని, ప్రభుత్వ మైనార్టీ ఐటిఐ కళాశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల పనులను ప్రారంభించి వచ్చే విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభమయ్యేలా ప్రభుత్వం శ్రద్ధ చూపాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, భరత్, యశ్వంత్, పవన్, చందు, సన్నీ, వీరేంద్ర, సుభాన్, పవన్, రాజు, నాగరాజు పాల్గొన్నారు. **హోళగుంద** మండలంలోని ఇంగలదహాల్ బాలుర వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు పంపాపతి అధ్యక్షత వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున, పాఠశాల అధ్యక్షులు మంజునాథ్, కమిటీ సభ్యులు మల్లి, పరమేష్, రెహ్మాన్, బాలాజీ పాల్గొన్నారు.


ఆదోనిలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



హోళగుందలో


కేక్ తినిపిస్తున్న కృష్ణమ్మ

సమిష్టిగా అభివృద్ధి చేస్తాం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

వెనుక బడిన ఆదోనిని సమిష్టిగా అభివృద్ధి చేస్తామని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. సోమవారం కూటమి ఎమ్మెల్యే పార్థసారథి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణంలో రోడ్ల వెడల్పు, బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి, మురుగు కాలువల ఆధునికీకరణ పనులు చేయించేలా ప్రణాళికలు రూపొందించి ముఖ్యమంత్రి బాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సాధిక్ వలీ, మురళీ, కపటి మాజీ ఎంపిటిసి, సర్పంచి మాధవ్, నాయీ బ్రాహ్మణ నాయకులు గోపాల్, సంతేకుడ్లూరు రాఘవరెడ్డి, మూకన్న, ఇంద్రానగర్ రామకృష్ణ, దేవేంద్ర, బైచిగేరి రామాంజి, మండగిరి బాబురావు, రేవన్ కుమార్, విజయ్, చిట్టి, శుక్రవారం పేట చంద్ర, ఇంద్రనగర్ వీరేష్, భరత్ కుమార్, చిరంజీవి, మునిస్వామి, ఖాసీం, బసవరాజ్ ఉన్నారు.

మార్కెట్ యార్డు ఛైర్మన్ రేసులో బెంగళూరు కిశోర్..?

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రేసులో బెంగళూరు కిశోర్ ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి రెండేళ్ల కాల పరిమితితో మార్కెట్ యార్డు కమిటీ ఏర్పాటు చేసేందుకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకటించింది. ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎస్సీ జనరల్ కావడంతో ఆశావహులు నేతల దగ్గర పావులు కదుపుతున్నారు. బెంగళూరు కిశోర్ సామాజిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, వైసిపి నేతలను ఎదురించి తన తల్లి ఆశయ సాధన కోసం, ఆలూరు అభివృద్ధి కోసం టిడిపిలో చేరారు. ఆలూరు సర్పంచి సీటును దక్కించుకొని తన బంధువు అక్క అరుణదేవి గెలుపునకు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఇన్‌ఛార్జీల సహకారంతో కృషి చేశారు. సర్పంచిని గెలిపించుకున్నప్పటి నుంచి అప్పటి వైసిపి మంత్రి, ఆయన అనుచరులు, అధికారులు ఆలూరు అభివృద్ధికి అడ్డుపడినా సొంత డబ్బుతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఉద్యోగం వదులుకొని టిడిపి అభివృద్ధికి తనదైన శైలిలో కృషి చేస్తున్నారు. ఆలూరు అభివృద్ధికి పాటుపడుతూ పని చేస్తున్న బెంగళూరు కిశోర్‌కు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఇవ్వాలని ఆయన సన్నిహితులు కోరుతున్నారు.


చంద్రబాబుతో బెంగళూరు కిశోర్ (ఫైల్)

ప్రజా సమస్యలే అజెండాగా పని చేస్తాం

- జనసేన ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప

ప్రజాశక్తి-ఆలూరు


మాట్లాడుతున్న వెంకప్ప

నియోజకవర్గ ప్రజా సమస్యలే అజెండాగా పని చేస్తామని జనసేన ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప తెలిపారు. సోమవారం జనసేన కేంద్ర పార్టీ కార్యాలయంలో శాసన మండలి ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్‌ను తెర్నేకల్ వెంకప్ప మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకప్ప మాట్లాడారు. గడచిన కాలంలో శాస్త్రీయంగా, నైతికంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశామని, ఇక నుంచి క్షేత్రస్థాయిలో కఠినమైన పోరాటానికి సిద్ధం కావాలని కార్యకర్తలనుద్దేశించి తెలిపారు. బాధ్యతతో కూడిన రాజకీయాలను ముందుకు నడిపించాలని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ అందుకు అవసరమైన సహకారం అందించే విధంగా చూడాలని గిడుగు హరిప్రసాద్‌ను కోరినట్లు తెలిపారు. ఎన్‌డిఎ కూటమి పట్ల విశ్వాసంతో టిడిపి నాయకులతో కలిసి పని చేయాలని అన్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో జనసైనికులపై వివక్షత చూపుతూ వారిని దూరం పెడుతున్న నాయకులపై సమాచారాన్ని సేకరించాలని, అలాంటి వారిపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తామని హరిప్రసాద్ తెలిపినట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన పార్టీ కోఆర్డినేటర్ చింత సురేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్ పాల్గొన్నారు.

'30 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేయరాదు'

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో పాత సినిమా టాకీస్‌కు చెందిన సర్వే నెంబర్ 335లోని 30 సెంట్ల స్థలాన్ని ఎవరూ కొనుగోలు చేయరాదని గ్రామానికి చెందిన చిన్న తులసి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. మొత్తం 86 సెంట్ల స్థలానికి గాను 56 సెంట్లు ఆడ బిడ్డ పేరుమీద దాన విక్రయం చేయించినట్లు తెలిపారు. మిగిలిన 30 సెంట్ల స్థలాన్ని తన భర్త చిన్న నాగరాజు ముగ్గురు బావలతో కొనుగోలు చేసి అగ్రిమెంట్లు రాయించుకున్నాడని చెప్పారు. తన భర్త మరణానంతరం ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించాలని కోరుతుండగా వారు రాకపోవడంతో పత్తికొండ కోర్టులో కేసు వేసినట్లు తెలిపారు. ఆ స్థలాన్ని ఎవరూ కొనుగోలు చేయరాదని, కొనుగోలు చేస్తే బాధ్యులు ఎవరూ కారని చట్ట పరిధిలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఆర్‌యులో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ జెండాను యూనివర్సిటీ కోకన్వీనర్ మౌలాలి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేయడం ద్వారా 2008లో రాయలసీమ యూనివర్సిటీని ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ యూనివర్సిటీని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజు, భరత్, నరేష్, నారాయణ, శివ, గణేష్, భీమేష్, నిఖిల్, రాజేంద్ర, నవీన్, జోష్, ప్రకాష్, ప్రతాప్, అశోక్, మనోహర్, బ్రహ్మ, రాజేష్, రవి, బాష, బాలాజీ, భూపాల్, అనిల్, నరసింహ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'విశ్వవాణి' విద్యార్థులు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

పట్టణంలోని న్యూ విశ్వవాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అబాకస్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ ఖలీల్ తెలిపారు. సోమవాం ఆయన మాట్లాడారు. వేదిక్ మ్యాథ్స్‌లో జ్ఞానేశ్వర్, కార్తీక్ ప్రతిభను చూపడంతో ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఫిబ్రవరి 9న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కర్నూలు నగరంలో జరిగిన అబాకస్, వేదిక్ జోనల్ స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయులు గిడ్డయ్య, డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు కల్పన, రాబీయా, శిరీష, జకీయా, రెహానా, మహేశ్వరి, జ్యోతి, భారతి, సంధ్య, ఈశ్వర్, పిఇటి బాబయ్య పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించాలి...

- సబ్ కలెక్టర్‌కు బాధితుని వినతి

ప్రజాశక్తి - ఆదోని

ఆస్తిని అడ్డదారుల్లో కొట్టేయాలన్న దురుద్దేశంతో తన చిన్న కుమారుడు ద్వారా తనకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని సీనియర్ సిటిజన్ స్వామినాథన్ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు న్యాయవాది చంద్రయ్యతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామినాథన్ మాట్లాడారు. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ 7వ రోడ్డులో నివాసం ఉంటున్నామని, తనకు భార్య సరోజమ్మతో పాటు పద్మావతి, రాధ, రవికుమార్, రమేష్ సన్నిలాతో కలిపి నలుగురు సంతానమని తెలిపారు. కుమారుడు రమేష్ సన్నిలా భార్య కల్పన కోయంబత్తూర్‌లోనే నివాసముంటున్నారని చెప్పారు. చిన్న కుమారుడు రమేష్ సన్నీలా మాయమాటలు చెప్పి తల్లితో కుమ్మక్కై ఆస్తి ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. 2020లో కలిసి ఉన్నప్పుడు 'టీ'లో తనకు విషమిచ్చి చంపాలని చూశాడని, వారం రోజుల పాటు అపస్మారక స్థితిలోకి వెళ్లానని తెలిపారు. ఆ సమయంలో తనను పెద్ద కుమారుడు రవికుమార్, పెద్ద కోడలు అనురాధ ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలు చేయించారన్నారు. తన పెద్ద కుమారుడు తనను బాగా చూసుకుంటున్నారని, ఆ కారణంగా పెద్ద కుమారుడు రవికుమార్‌పై కూడా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. తన కష్టార్జితమైన ఆస్తిని గిఫ్ట్ రూపంలో తన భార్య సరోజమ్మ పేరుతో కొంత ఇచ్చామన్నారు. ఆ ఆస్తిని కొట్టేయాలని కుట్ర చేస్తున్నారని వాపోయారు. 84 ఏళ్ల వయస్సు గల తన ఆలనపాలన చూసేవారు లేరని, ఈ వయస్సులో తనను మానసికంగా వేధిస్తున్న చిన్న కుమారుడు రమేష్ సన్నీలా, కోడలు కల్పన, భార్య సరోజపై చర్యలు తీసుకొని గిఫ్ట్ రూపంలో పొందిన ఆస్తి డాక్యుమెంట్లను రద్దు పరచి తనకు న్యాయం చేయాలని కోరారు.


న్యాయవాదితో కలిసి సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న స్వామినాథన్

గడ్డివామి దగ్ధం

- రూ.లక్ష నష్టం

ప్రజాశక్తి - కౌతాళం


దగ్ధమవుతున్న గడ్డివామి

మండలంలోని సులేకేరి గ్రామంలో గడ్డివామి దగ్ధమై రూ.లక్ష నష్టం వాటిల్లిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సాలి చంద్ర అనే రైతు పాడి పశువుల కోసం కొనుగోలు చేసి నిల్వ చేసుకున్న గడ్డి దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తుల వల్ల జరిగిన సంఘటన అని ఆయన పేర్కొన్నారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నారు. ఆదోని నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పి అదుపు చేసింది. పశు గ్రాసం కోసం ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. **నందవరం** మండలం కనకవీడు గ్రామంలో రైతు గజ్జల పెద్దయ్యకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదం వల్ల రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. ఉన్నట్టుండి భారీగా మంటలు రావడంతో గడ్డివామి దగ్గరికి వెళ్లి గ్రామస్తుల సహకారంతో మంటలను అదుపు చేయటానికి ప్రయత్నం చేశారు. మంటలు అదుపు కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం మండల సీనియర్ నాయకులు మాణిక్యప్ప

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని జొహరాపురం గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల సీనియర్ నాయకులు మాణిక్యప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఎంపిడిఒ గీతావాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జొహరాపురం గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీల్లో నీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నెలకోసారి నీళ్లు వదిలితే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కనీసం వారానికోసారి తాగు నీరు వదలాలన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వేసవిలో ఇంకెంత ఇబ్బందులు ఎదుర్కోవాలో అధికారులు గమనించాలని తెలిపారు. నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. లేకపోతే ప్రజలను సమీకరించి ఎంపిడిఒ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.


మాదాసి/మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ రద్దు చేయాలి

- జడ్‌పిటిసి దొరబాబు

ప్రజాశక్తి - ఆస్పరి

మాదాసి/మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ రద్దు చేయాలని జడ్‌పిటిసి దొరబాబు, ఎంపిటిసి నరసప్ప డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి, తహశీల్దార్ శివశంకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో ఎస్సీ జాబితాలో ఎస్సీలు కానీ, బీసీ కులానికి చెందిన కురువలను చేర్చి ఎస్సీలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. విచారణ జరిపి ఎస్సీ జాబితాలో చేర్చిన బీసీలను తొలగించి ఎస్సీలకు న్యాయం చేయాలని కోరారు. శేఖర్, నెట్టేకల్లు, బాలరాజు, రంగన్న, ముక్కన్న, వసంత రాయుడు, ఎల్లప్ప, జోజి పాల్గొన్నారు. అలాగే ఎంఎస్‌పి ఆధ్వర్యంలో తహశీల్దార్ శివశంకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంఎస్‌పి జిల్లా కార్యదర్శి సంజప్ప మాట్లాడారు. మాదాసి/మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇచ్చి ఎస్సీలకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎంఎస్‌పి మండల అధ్యక్షులు రామాంజనేయులు, ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు సంజన్న, కరుణాకర్, పరమేష్, గోవిందు, హనుమంతు, రాజు మాదిగ పాల్గొన్నారు. **ఆదోని** సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. దళిత అభ్యుదయ సేవా సంఘం నాయకులు కల్లుపోతుల రంగన్న, ప్రసాద్, శాంత కుమార్ మాట్లాడుతూ... తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం పొందిన వారిపై విచారించి తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం పొందిన వారిని, తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చిన వారిని, తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం పొందడానికి ప్రోత్సహించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కుంకనూరు వీరేష్, లక్ష్మీనారాయణ, బాలాజీ, గంగాధర్, రామకృష్ణ పాల్గొన్నారు. **మంత్రాలయం** తహశీల్దార్ కార్యాలయంలో జైభీమ్ ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు గాడిమోడి నరసింహులు తహశీల్దార్ ఎస్.రవికి వినతిపత్రం అందజేశారు. జైభీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ, జిల్లా కార్యదర్శి రత్నం మాదిగ, అనిల్ మాదిగ, మారెప్ప, సుదర్శన్, మారెప్ప, రాజు పాల్గొన్నారు.


ఆస్పరి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


ఆర్‌డిఒకు విన్నవిస్తున్న నాయకులు

రేషన్ డీలర్ రిజర్వేషన్ మార్పు చేయాలి

- దళిత నాయకులు

ప్రజాశక్తి -ఆలూరు

మండలంలో ఎం.కొట్టాల గ్రామ రేషన్ డీలర్‌ను మొలగవల్లిగా చూపుతూ ఎస్టీ రిజర్వేషన్ చేయడం వల్ల తాము నష్టపోతామని రిజర్వేషన్‌ను ఎస్సీగా మార్పు చేయాలని దళిత నాయకులు రామాంజినేయులు, రాజు, చిట్టన్న కోరారు. సోమవారం పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఎం.కొట్టాలకు రావాల్సిన షాపు-25ను మొలగవల్లికి మార్పు ఎలా చేశారన్నారు. ఎం.కొట్టాల గ్రామంలో ఎస్టీలు లేరని, ఆ వర్గానికి ఎలా రిజర్వేషన్ కేటాయించారని ప్రశ్నించారు. ఈ విషయంపై విచారించి న్యాయం చేయాలని కోరారు.

జిజిహెచ్‌కు ఈసీజీ మిషన్ విరాళం

- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వాస్పత్రికి ఆదోనిలోని దేశాయి నర్సింగ్ హోమ్ డాక్టర్ వసంతి దేశాయి రూ.1.20 లక్షల విలువ గల సెక్షన్ ఆపరేటర్-2, ఫిలిప్స్ ఈసీజీ మిషన్-2లను విరాళంగా అందజేశారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. అత్యవసర విభాగాలకు సెక్షన్ ఆపరేటర్, ఫిలిప్స్ ఈసీజీ మిషన్ ఇవ్వడానికి ముందుకొచ్చిన డాక్టర్ వాసంతి దేశాయికి కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రిలో ఎమర్జెన్సీ విభాగాలకు వీటిని అందించనున్నట్లు చెప్పారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, డిప్యూటీ కలెక్టర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ ఎడి రమేష్, ఎఒ శ్రీనివాసులు పాల్గొన్నారు.


మిషన్లను విరాళంగా అందజేసిన డాక్టర్ వాసంతి దేశాయి

కెఎంసి ప్రిన్సిపల్‌ను కలిసిన సింధు సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్


కర్నూలు ప్రభుత్వాస్పత్రి అడ్మినిస్ట్రేటర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ కలెక్టర్ పి.సింధు సుబ్రహ్మణ్యం సోమవారం కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మను కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తనను కలిసిన పి.సింధు సుబ్రహ్మణ్యంను అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ... ఆస్పత్రి అభివృద్ధికి అందరూ సమిష్టిగా పనిచేసి రోగులకు మరింత సత్వరంగా సేవలు అందేలా కృషి చేయాలని కోరారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ హరి చరణ్, డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ రేణుకా దేవి, అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

జొన్నగిరి గ్రామానికి నీరివ్వాలి

- రైతుసంఘం ఆధ్వర్యంలో రైతుల ధర్నా

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని జొన్నగిరి గ్రామానికి నీరు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు ధర్నా చేపట్టారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ... మండలంలోని జొన్నగిరి గ్రామంలో గోల్డ్ మైనింగ్ కంపెనీ హంద్రీ కాలువ నుంచి నీరు తీసుకెళ్తున్నారని, జొన్నగిరిలో వారు ఏర్పాటు చేసి చెరువుకు నీరు నింపాలని కోరారు. చెరువులో నీరుంటే పశువులకు, మేకలకు, మూగజీవాలకు, పొలాల్లో వేసిన బోర్లకు నీటి సదుపాయం బాగుంటుందని తెలిపారు. తాగడానికి నీరు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గోల్డ్ మైనింగ్ సంస్థ వారికి జొన్నగిరి రైతులు పైపులైన్ కోసం భూమి ఇచ్చారని తెలిపారు. గ్రామంలో నీటి సమస్య ఎక్కువగా ఉండడంతో గోల్డ్ మైనింగ్ సంస్థ వారు ఇక్కడ ఒక వాలు ఏర్పాటు చేసి నీరివ్వాలని రైతులు కోరుతున్నారని చెప్పారు. అందుకు అంగీకరించలేదని రైతులు, సిపిఎం నాయకులు ధర్నా చేశారు. రెండు రోజులు పని చేయకుండా నిలిపివేస్తామని, సమస్యను పరిష్కరించుకోవాలని జొన్నగిరి పోలీసులు తెలిపారు. గోల్డ్ మైనింగ్ సంస్థ వారు రైతులకు హామీ ఇచ్చే వరకు పైపు లైన్ పనులను జరగనివ్వబోమని రైతులు హెచ్చరించారు. రైతుసంఘం (సిపిఎం) మండల కార్యదర్శి కొండారెడ్డి, అద్దంకి నాగర్జున, రైతులు లోకనాథ్ రెడ్డి, చిన్న జొన్నగిరి గుంత హనుమన్న (దుబ్బన్న), హోటల్ వెంకటేష్, ఈరన్న పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, రైతులు

వాలీబాల్‌లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - చిప్పగిరి


వాలీబాల్ విజేతలతో అధ్యాపకులు

కర్నూలులో 'ఈనాడు స్పోర్ట్స్' నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు, సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం కళాశాలలో వారు మాట్లాడారు. ఈ పోటీల్లో వాలీబాల్‌లో ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. కళాశాలకు చెందిన కరుణాకర్, సీనియర్ ఎంపిసి మధు, సీనియర్ బైపిసి విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయినట్లు చెప్పారు. ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎఫ్ఆర్ విద్యార్థులు

ప్రజాశక్తి- దేవనకొండ


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఉచ్చీరప్ప, కరస్పాండెంట్ రఘునాథ్ సోమవారం తెలిపారు. ఆదోని పట్టణంలో జరిగిన అబాకస్ జిల్లాస్థాయి పోటీల్లో ఎఫ్ఆర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు చెప్పారు. సీనియర్ విభాగంలో 8వ తరగతి రూప, జూనియర్ విభాగంలో ప్రశాంత్ 5వ తరగతి విద్యార్థులు మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. వీరు జనవరి 9న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, వసంత, రవీంద్ర, రంగస్వామి, షభానా, శ్రావణి, హేమలత, ఉష పాల్గొన్నారు.

ఘనంగా యాపిల్ డే

ప్రజాశక్తి - కౌతాళం


యాపిల్ డే నిర్వహిస్తున్న సిబ్బంది

పట్టణంలోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో యాపిల్ డే (ఫలాలు)ను ఘనంగా నిర్వహించారు. సోమవారం విద్యార్థుల ఆధ్వర్యంలో పండ్లు, ఫలాలు వాటి ఉపయోగాలు, పండ్ల రకాలు, వాటి రంగులు విద్యార్థులతో ఆటల పాటల రూపంలో పలుకుతూ ప్రదర్శనను నిర్వహించారు. చిట్టి విద్యార్థినులు యాపిల్ రంగుల డ్రస్సులతో యాపిల్ పండు రంగు, రుచి, లాభాలు వివరించి ఎంతో ఆకట్టుకున్నారు. ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్‌బాష, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సబియా, ముంతాజ్, శిరీష పాల్గొన్నారు.

8 నుంచి లా సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జనవరి 8 నుంచి 30 వరకు మూడు, ఐదు సంవత్సరాల డిగ్రీ కోర్సులకు సంబంధించిన సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సులకు సంబంధించిన 2, 4, 6, 8, 10 సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.